సీసీ కెమెరాలు ఉండాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన పునరావృతం కాకుండా వైద్యులు, వైద్యసిబ్బంది రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠ చట్టాలను తేవాలి. రాత్రి వేళ వైద్యశాలల్లో విధులు నిర్వహించే మహిళా వైద్యసిబ్బందికి తగిన రక్షణ కల్పించాలి. గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీలకు రాత్రి వేళ పోలీసు సెక్యూరిటీ కల్పించాలి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. మహిళా సిబ్బందికి ప్రత్యేకంగా టాయిలెట్లు, డ్రస్ ఛేంజింగ్ రూములు ఏర్పాటు చేయాలి. – డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, కలిగిరి పీహెచ్‌సీ

రాత్రి వేళ రక్షణ అవసరం



కోల్‌కతాలోని జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన మానవమృగాలను కఠినంగా శిక్షిస్తేనే భవిష్యత్‌లో ఇలాంటి దారుణ ఘటనలు పునరావృతం కావు. గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీల్లో పని చేసే వైద్యులు, వైద్యసిబ్బంది రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. రాత్రి వేళల్లో సెక్యూరిటీ లేని కారణంగా బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి మహిళా డాక్టర్లు, సిబ్బందికి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. – సీహెచ్ లక్ష్మీమాధురి, స్టాఫ్‌నర్సు, జలదంకి పీహెచ్‌సీ

కఠిన చట్టాలు తప్పనిసరి



విధి నిర్వహణలో ఉన్న డాక్టర్లకు, వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి. సమాజంలో మహిళలపై జరిగే దారుణాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలు చేయాలి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను వెంటనే శిక్షించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలందించే డాక్టర్లకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. – డాక్టర్ కీర్తిప్రియ, కసుమూరు పీహెచ్‌సీ



క్లుప్తంగా

నేడు వెంకయ్యస్వామి ఆరాధన

ఆత్మకూరురూరల్: మండలంలోని దేవూరులో భగవాన్ వెంకయ్యస్వామి 34వ ఆరాధన మహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు భక్తబృందం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వేకువజామున సుప్రభాతసేవ, ఉదయం విశేషాభిషేకాలు, పూజలు, రాత్రికి గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

వరికుంటపాడు: ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని పీహెచ్ఎన్ సుశీలమ్మ సూచించారు. వరికుంటపాడు పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందితో శుక్రవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలన్నారు. గర్భిణుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

డ్రాపౌట్స్‌పై ప్రత్యేక దృష్టి



మర్రిపాడు: మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాలలో చదువుతూ మానేసిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. పడమటినాయుడుపల్లి గిరిజన కాలనీకి చెందిన ఓ విద్యార్థి బడి మానేసి గొర్రెలకు కాపలాగా వెళ్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు శివశంకర్ గురువారం అక్కడకు వెళ్లి తల్లిదండ్రులకు నచ్చజెప్పి విద్యార్థిని తిరిగి పాఠశాలకు తీసుకొచ్చారు. విద్యార్థికి కావాల్సిన విద్యా సామగ్రిని అందజేశారు. దీంతో శివశంకర్‌ను పాఠశాల సిబ్బంది, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

–మహిళకు గాయాలు

ఉదయగిరి: మండలంలోని సున్నవారిచింతల గ్రామ సమీపంలో శుక్రవారం బైక్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో గుడినరవకు చెందిన బక్కా సుజాత గాయాలపాలైంది. ఆమె మరో వ్యక్తితో కలిసి గండిపాళెం నుంచి వెంకటంపేటకు బైక్‌పై వెళుతుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో సుజాతకు తల, శరీరంపై గాయాలు కాగా ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. మరోవ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదు.

బైక్ దగ్ధం



మర్రిపాడు: మండలంలోని చుంచులూరు సచివాలయం వద్ద నిలిపి ఉంచిన బైక్ దగ్ధమైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడికి కథనం మేరకు.. అనంతసాగరం మండలం గోగులపల్లికి చెందిన చుక్కా విజయ్ చుంచులూరు సచివాలయం వద్ద బైక్‌ను నిలిపి బస్సులో వేరే ఊరు వెళ్లారు. ఏమైందో ఏమో కానీ బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి కాలిపోయింది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

923 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 923 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 1030 బేళ్లు రాగా, 923 బేళ్లను విక్రయించినట్లు చెప్పారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.358, కనిష్ఠంగా రూ.204, సగటున రూ.306.11 ధర పలికిందని వివరించారు. వేలంలో 15 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

సంగం: మరదలిని వేధిస్తున్న బావపై సంగం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. దువ్వూరులోని పడమటి హరిజనవాడకు చెందిన కరేటి రాము తన అక్క పెద్ద కుమార్తె వరలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. ఆమె చెల్లెలు సంధ్య వివాహమై భర్తకు దూరంగా పడమటి హరిజనవాడలోనే తన తల్లి జయమ్మ వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో సంధ్య గురువారం ఫోన్‌లో మాట్లాడుతుండగా రాము లాక్కుని పగులగొట్టి వేధింపులకు గురిచేశాడు. దీంతో మనస్తాపానికి గురైన సంధ్య శుక్రవారం సంగం పోలీసులకు ఫిర్యాదు చేయగా రాముపై కేసు నమోదు చేశారు.

శుద్ధ అబద్ధం

అనుమతుల్లేకుండానే వాటర్‌ప్లాంట్ల ఏర్పాటు

- నాణ్యతా ప్రమాణాలను పాటించని నిర్వాహకులు
- మినరల్ పేరుతో జనరల్ వాటర్ విక్రయం
- ప్రజారోగ్యంతో చెలగాటం
- పట్టించుకోని సంబంధిత అధికారులు



ఆటోలో ట్యాంకును ఏర్పాటు చేసుకుని మినరల్ వాటర్ విక్రయిస్తున్న దృశ్యం

కావలి: ఫ్లోరైడ్..ఉప్పు నీటి నుంచి ఉపశమనం కోసం ప్రజలు మినరల్ వాటర్ వైపు మళ్లారు. స్థానిక సంస్థల ద్వారా సరఫరా చేసే నీటిని రోజువారీ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. అధిక శాతం మంది మినరల్ వాటర్‌పైనే ఆధారపడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు అనుమతుల్లేకుండానే వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాల ఊసే లేకుండా అరకొరగా శుద్ధి చేసిన నీళ్లను క్యాన్లలో నింపి మినరల్ వాటర్ పేరుతో విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. జీవనశైలిలో మార్పులు, ఆరోగ్యంపై పెరుగుతున్న శ్రద్ధ కారణంగా ప్రతిఒక్కరూ మినరల్ వాటర్ తాగేందుకే ఆసక్తి చూపిస్తుండటంతో వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కావలి డివిజన్ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రస్తుతం 400కు పైగా వాటర్ ప్లాంట్లు వ్యాపారం సాగిస్తున్నాయి. వీటిలో ఒక్కటంటే ఒక్కటి కూడా నిబంధనలు పాటించడం లేదు. సాధారణంగా ప్రజలకు శుద్ధి చేసిన నీటిని విక్రయించాలంటే తప్పనిసరిగా ఐఎస్ఐ అనుమతి పొందాలి. ఇందుకోసం నీటి శుద్ధి కేంద్రాల్లో రసాయన, సూక్ష్మజీవ ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలి. ఎప్పటికప్పుడు నీటిని శుద్ధి చేసే ముందు, చేసిన తరువాత విధిగా పరీక్షలు చేయించి నివేదికలు రూపొందించాలి. ఈ నివేదికలను ఐఎస్ఐ సిబ్బంది పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే నీటి వ్యాపారానికి అనుమతినిస్తారు. ఇవన్నీ జరిగిన తరువాతే నీటిని క్యాన్లు, సీసాల్లో నింపి విక్రయించాలి. క్యాన్‌పై కంపెనీ పేరు, తయారైన తేదీ, ఎప్పటిలోగా వినియోగించాలి, తదితర వివరాలను స్పష్టంగా ముద్రించాలి.

కావలి డివిజన్‌లో ఉన్న వాటర్ ప్లాంట్లకు ఎటువంటి ల్యాబొరేటరీలు లేవు. ప్రభుత్వ నిబంధనల మేరకు ల్యాబ్‌ల ఏర్పాటు, నిర్వహణకు రూ.4లక్షల వరకు వ్యయం అవుతుంది. దీంతో వాటిని ఏర్పాటు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. మినరల్ వాటర్ పేరుతో నీటిని సాధారణ ఆర్వో (రివర్స్ ఆస్మోసిస్) ప్లాంట్ల ద్వారా అరకొరగా శుద్ధి చేసి విక్రయించేస్తున్నారు. నీటని నింపే క్యాన్లను కూడా సరిగా శుభ్రం చేయడం లేదు. క్యాన్ల లోపల పాచిపట్టి, చెడు వాసన వస్తున్నాయి. ఇలా తయారు చేసిన నీటినే దుకాణాలు, గృహావసరాలకు ఆటోల ద్వారా తరలిస్తూ అడ్డగోలుగా సొమ్ము చేసుకుంటున్నారు. 20లీటర్లు ఉండే క్యాన్‌ను రూ.10 నుంచి రూ.20 వంతున ప్రతిరోజూ లక్ష క్యాన్లకు పైగా నీటిని విక్రయిస్తున్నారు. ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న మినరల్ వాటర్ నాణ్యత విషయంలో తరచూ తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల అవసరం...అధికారుల నిర్లక్ష్యం వెరసి మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వాహకులకు కాసులు వర్షం కురిపిస్తుండగా, ప్రజలకు మాత్రం అనారోగ్యాన్ని తెచ్చిపెడుతోంది.



కావలిలో ఓ ఇంటి ముందు ఏర్పాటు చేసిన మినీ వాటర్ ప్లాంట్

దివ్యాంగుడికి ఆధార్ కార్డు మంజూరు

సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి: పట్టణంలోని సిని మాహాలు వీధికి చెందిన షేక్ ఖాజావలి దివ్యాంగుడు. దివ్యాంగ పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్ లేక తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్న వైనంపై 'ఆధార్ కోసం అగచాట్లు' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం కథనం ప్రచురితమవడంతో తహసీల్దార్ ఎం సుభద్ర స్పందించారు. వీఆర్వో ద్వారా సమాచారం సేకరించి వెంటనే బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలోని ఆధార్ కేంద్రంలో ఆధార్ నమోదు చేయించారు. సీనియర్ అసిస్టెంట్ సంధాని, వీఆర్వోలు జాఫర్, అంజాద్ చొరవ తీసుకుని ఆధార్ ఇప్పించారు.



ఖాజావలితో మాట్లాడుతున్న తహసీల్దార్ సుభద్ర

ఇష్టకామేశ్వరీదేవికి విశేష పూజలు



సీతారామపురం: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రాచీన శైవక్షేత్రమైన ఘటిక సిద్ధేశ్వరంలో కొలువైన ఇష్టకామేశ్వరీ దేవికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది.

వైభవంగా లక్ష కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళా భక్తులు



కుంకుమార్చన నిర్వహిస్తున్న వేద పండితులు

సంగం: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో లక్ష కుంకుమార్చనను వైభవంగా నిర్వహించారు. తొలుత దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు మహిళా భక్తులతో సామూహికంగా కుంకుమార్చన జరిపారు. ఆ తరువాత ఊరేగింపుగా పెన్నానది వద్దకు చేరుకుని కుంకుమను జలాల్లో కలిపారు.

ఉప విద్యాశాఖ అధికారి తనిఖీలు



అనుమసముద్రంపేట : మండలంలోని గుంపర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆత్మకూరు ఉప విద్యాశాఖ అధికారి గోపాల్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. అనంతరం ఇటీవల నాటిన మొక్కలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీఅవర్స్ నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలన్నారు.

గ్రామాల సుస్థిర ప్రగతికి శ్రీకారం

బిట్రగుంట: ప్రజల భాగస్వామ్యంతో ప్రతి పల్లెలో సుస్థిర ప్రగతికి శ్రీకారం చుట్టేలా ప్రభుత్వం గ్రామసభల ద్వారా చర్యలు చేపట్టినట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల గుర్తింపునకు జువ్వలదిన్నెలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధి పని కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికి వంద రోజుల పని కల్పించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న పదిహేను రోజుల్లోనే పని కల్పించేలా పటిష్ఠ విధానం రూపొందించినట్లు వివరించారు. ఆలోగా పని చూపించలేకపోతే పని కోరిన రోజు నుంచి నిరుద్యోగభృతి అందించే అవకాశం కూడా కల్పించినట్లు తెలిపారు. ఉపాధి ద్వారా నిర్మాణాత్మక అభివృద్ధి జరిగేలా గ్రామసభల ద్వారా ప్రజల సమక్షంలోనే పనులు గుర్తిస్తున్నట్లు వివరించారు. కావలి డీఎస్పీ వెంకటరమణ పాల్గొన్నారు.

అల్లూరు: నార్త్‌ఆములూరులో ఉపాధి పనుల గుర్తింపునకు సర్పంచ్ షేక్ కరిముల్లా షాఖాదర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద పంచాయతీల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి చేపట్టనున్నట్లు తెలిపారు. డీఎస్పీ వెంకటరమణ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న అందరికీ పనులు కల్పిస్తాం

చేజర్ల: ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు ఉన్న అందరికీ వంద రోజుల పని కల్పిస్తామని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఏటూరులో జరిగిన గ్రామసభలో పీడీ మాట్లాడారు.ఉపాధి పనుల్లో రైతులకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. మొక్కలు నాటడం, ఫారంపాండ్, చెరువుల్లో పూడికతీత, తదితర పనులు చేపట్టవచ్చని వివరించారు. చేజర్లలో జరిగిన గ్రామసభలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రైతులకు అవసరమైన పనులు చేపట్టాలన్నారు. ఉపాధి ఏపీఓ వెంకటేశ్వర్లు, ఈసీ, టీఏల పనితీరు సరిగా లేదని, తీరును మార్చుకోవాలని హితవుపలికారు. ఎంఈఓ–2 మస్తానయ్య, ఏటూరు సర్పంచ్ నాగభూషణమ్మ, ఉపసర్పంచ్ పువ్వాడి నాగేశ్వరరావు, పీఎస్ రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం: మండలంలోని 19 పంచాయతీల్లో ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీఓ బ్రహ్మయ్య, ఏపీఓ చెంచయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నోడల్ ఆఫీసర్లుగా వ్యవహరించి గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అల్లూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



చేజర్ల: మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి

వరికుంటపాడు: మండలంలోని 24 పంచాయతీల్లో ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించారు. వరికుంటపాడు, రామాపురం పంచాయతీల్లో జరిగిన గ్రామసభల్లో ఎంపీడీఓ ఎస్ మల్లికార్జున పాల్గొని మాట్లాడారు. గ్రామసభల్లో ఆమోదించిన పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు.

సంగం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలను నిర్వహించారు. సంగం సచివాలయంలో ఎంపీడీఓ గోపి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ రమణమ్మ, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, కిషోర్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కలిగిరి: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించారు. అనంతపురంలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీపీ మెట్టుకూరు శిరీష పాల్గొన్నారు. ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి చేపట్టాలని సూచించారు. ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, పీఆర్ ఏఈ రవీంద్రనాథ్, నాయకుడు మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: చిలకపాడు పంచాయతీలో సర్పంచ్ సిద్దంరెడ్డి రమాదేవి, డీసీపల్లిలో సర్పంచ్ రేవూరు సుప్రజ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఏఓ రామ్మోహన్, నాయకులు బొర్రా సుబ్బిరెడ్డి, కృష్ణపాటి మధుసూదన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉదయగిరి: ఉదయగిరి, వింజమూరు మండలాల్లోని అన్ని పంచాయతీల్లో ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభలకు ప్రజల నుంచి స్పందన అంతంతమాత్రంగానే కనిపించింది. వింజమూరులో జరిగిన గ్రామసభకు బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మల ప్రత్యేకాధికారిగా హాజరయ్యారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- వ్యక్తికి తీవ్రగాయాలు

సోమశిల: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన అనంతసాగరం మండలం గౌరవరం సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. కామిరెడ్డిపాడుకు చెందిన వేణు తన మోటార్ సైకిల్‌పై గౌరవరం సమీపంలో వెళ్తుండగా, చిలకలమర్రి నుంచి అనంతసాగరం వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో వేణు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం అనంతసాగరం పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అనంతసాగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయినికి తీవ్ర గాయాలు

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయిని తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మండలంలోని పుల్లాయపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎం ఆదిలక్ష్మి ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత స్వగ్రామమైన వైఎస్సార్ జిల్లా రసాయిపేటకు వెళ్లేందుకు మోటార్‌సైకిల్‌పై యర్రబల్లిగడ్డ సెంటర్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో శకునాలపల్లి సమీపంలోని చప్టా వద్ద ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి జారి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. తొలుత ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు పంపించారు.

చిరస్మరణీయుడు ఆంధ్రకేసరి

ఆత్మకూరు: స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్డీఓ, రవాణా శాఖ కార్యాలయాల్లో టంగుటూరి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఎం నిరంజన్, ఎంవీఐ కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం రాములు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీటీలు సంధ్య, రవి, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి వేడుకలు

ఆత్మకూరురూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి అధికారులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సీఎంగా ఆంధ్రకేసరి సేవలను స్మరించుకున్నారు. ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి తహసీల్దార్ సుధీర్ పూలమాల వేసి నివాళులర్పించారు. డీటీ రాజేష్, ఆర్ఐ పృథ్వీ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

- బండారుపల్లి, మహిమలూరు, వెన్నవాడ, బోయలచిరివెళ్ల, కరటంపాడు, ముర‌గళ్ల, బట్టేపాడు, దేపూరు, గండ్లవేడు, తదితర ప్రభుత్వ పాఠశాలల్లో టంగుటూరికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. టంగుటూరి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు.

అల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి ఎంపీపీ శశిరేఖ పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి ఎంపీడీఓ శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ముఖ్యమంత్రిగా టంగుటూరి అందించిన సేవలను స్మరించుకున్నారు.

సోమశిల: అనంతసాగరం మండల తహసీల్దార్ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి తహసీల్దార్ వీరవసంతరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వో, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పుల్లయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఏ సురేష్, బీ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: ఉదయగిరి, వింజమూరు తహసీల్దార్ కార్యాలయాలతో పాటు ఉదయగిరిలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి అధికారులు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్లు ఎం సుభద్ర, సయ్యద్ హమీద్, సిబ్బంది, అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



అల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ శశిరేఖ



ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయంలో..



ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో ..



ఏఎస్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో..



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో..



ఆత్మకూరురూరల్:బండారుపల్లి ఎంపీపీయూపీ పాఠశాలలో..



చేజర్లలోని జూనియర్ కళాశాలలో..



సోమశిల: అనంతసాగరం తహసీల్దార్ కార్యాలయంలో..



ఆత్మకూరు ఎంవీఐ కార్యాలయంలో..